# ★ ఇంటర్వ్యూ కాల్ ★

వై. వి. ఎస్. ఎస్. ఎన్. మూర్తి

ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి ఆఫీసు మెట్లు ఎక్కుతూ "ఇది ఎన్నో సారో రావడం ఇక్కడకు" అనుకున్నాడు రమణ. దారితెలిసిన మనిషిలా ఆఫీసులోకి తీసుకెళ్ళాయి, అరిగిపోయి తెగిపోవడానికిసిద్ధంగా ఉన్న చెప్పులు. టైప్‌మిషన్ల వాద్య సంగీతం మధ్య ఎడతెరిపి లేకుండా వ్రాస్తున్నాయి చేతులు, లౌడ్‌స్పీకర్లులా మొరుగుతున్నాయి గొంతులు, రెడ్‌టేప్‌ల మధ్య పెద్ద హోరు మధ్య తల ఎత్తకుండా కొన వూపిరితో వున్న బక్క బతుకులు కొన్ని ఫైళ్ళలో దూరి కాళ్ళమీద నిలబడ్డాయి. మధ్య మధ్య అక్కడక్కడ కుర్చీలో కూర్చొన్న బలసిన పంది కొక్కులు తలలెత్తి చూస్తున్నాయి.

ఆఫీస్‌లో అడుగుపెట్టిన రమణ్ణి గుమ్మం దగ్గరే అడ్డుపెట్టాడు దర్వానుడు. ఆఫీసనే పరమపద సోపానాల్లో దర్వానుడే మొదటి మెట్టు. లోపలికి పంపమని బ్రతిమలాడాడు రమణ. "వీల్లేదు" పొమ్మన్నాడు దర్వానుడు. "విధిలేదు" అన్నట్లు అటు-ఇటు చూసి అర్ధరూపాయి బిళ్ళ దర్వానుడి గుప్పిటిలో పెట్టాడు రమణ, అంత వరకూ ధుమధుమ లాడుతున్న దర్వానుడి ముఖం ప్రసన్నంగా మారిపోయింది. "పెద్ద అయ్యగారు ఇప్పుడే వచ్చారు. బిజీగా ఉన్నారు, ఇంకా ఎవరెవరో పెద్ద పెద్ద బాబులు వచ్చారు. ఇప్పుడిక వీలు కాదు. ఇంకా ఒక గంట పోనివ్వండి. అంత వరకూ ఆ బల్లమీద కూర్చోండి" అని మర్యాద చేశాడు దర్వానుడు. రమణ బల్లమీద కూర్చున్నాడు. అతడు కూర్చున్నాడు గాని మనస్సు మాత్రం స్వాధీనం తప్పిన గుర్రంలా పరుగెడుతూనే ఉన్నది ఎటో.

తను బి.ఏ. ప్యాసయి రెండేళ్ళు అయింది. ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజీలో పేరు నమోదు చేయించి ఆరు సంవత్సరాలయింది. ఇంతవరకూ సరైన ఇంటర్వ్యూ కాల్ రాలేదు. ఏవేవో నెల-రెండు నెలల టెంపరరీ వేకెన్సీలకు సంబంధించిన కాల్స్ వచ్చాయి. ఇంటర్వ్యూకి వెళ్ళినా ప్రయోజనం కనపడలేదు. "ఫోర్టులో ఉద్యోగాలు కాళీగా ఉన్నాయి" అని అందరికీ తెలిసినట్లే తనకూ తెల్సింది, కాని "అక్కడకాళీలు ఉన్నట్లు సమాచారం మాకేమీ అందలేదు" అంటారు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి వాళ్ళు. లేదు మేం పంపాం అంటారు ఫోర్టు వాళ్ళు, ఏది నిజమో తెలీదు కాని తనకంటే వెనుక పేర్లు నమోదు చేయించుకున్న వాళ్ళందరికి ఫోర్టులో కాల్స్ వచ్చాయి. ఉద్యోగాలూ వచ్చాయి. తనకే రాలేదు ఇంతవరకూ ప్రక్కింటి వెంకటరత్నం ఫోర్టులో అక్కౌంటుంటు. కాళీలున్నాయని పేర్లు పంపమని ఎక్స్చేంజికి వ్రాసినట్లు కూడా చెప్పాడు. "నువ్వు ఎక్స్చేంజి నుండి పదో-పాతికో ఖర్చు పెట్టి కాల్ తెచ్చుకో! వెయ్యో!

కథానిక

రెండు వేలో ఖర్చయినా నీకు ఉద్యోగం దొరికే ఏర్పాట్లు నేను చేస్తాను." అన్నాడు. అతడి సలహామీదనే, ఏ విధంగానైనా ఈ వేళ కాల్ సంపాదించుకొనిఇంటికి వెళ్ళాలనే నిశ్చయంతో ఇంట్లోని స్టీలు కారియర్ 25 రూపాయలకి కుదువపెట్టి ఆ డబ్బు తీసుకొని వచ్చాడు. ముందు ఇంటర్వ్యూ కాల్ వస్తే కదా! తన యోగ్యతలతో (నిజానికి యోగ్యతలను బట్టి ఉద్యోగాలిస్తే!) ఉద్యోగం సంపాదించడానికి" అనుకున్నాడు రమణ.

రమణ గత రెండేండ్లలో లోక జ్ఞానం సంపాదించాడు. మానసికంగా కూడా ఎదిగాడు. కాని మనిషి కృంగిపోయాడు. ఎప్పటికప్పుడు నిరాశ ఎదురౌతున్నా, ఓర్పుతో ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు ఎందరెందరో నిరుద్యోగుల్లాగ. ఆలోచనల్ని భోంచేస్తున్న రమణ దర్వాను డి పిలుపుతో బాహ్యలోకంలోకి వచ్చాడు. "బాబూ! వేణు బాబు ఖాళీగా ఉన్నాడు. వెళ్ళి ఆయన్ని పట్టండి. మనిషి మాంచి ఉద్దండుడు, ఆవలిస్తే ప్రేవులు లెక్క పెడతాడు. మచ్చిక చేసుకొని పని జరిపించుకోండి" అని రహస్యం ఏదో చెప్పినట్లు చెప్పాడు దర్వానుడు.

రమణ సరాసరి వేణు సీటు దగ్గరకే వెళ్ళాడు. విష్ చేశాడు. సమాధానంగా తలపంకించి వచ్చిన పని ఏమిటన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించాడు వేణు. సదరు వేణు గత ఆరేళ్ళుగా అదే సీట్లో ఉండి కావల్సిన వాళ్ళెంతో మందికి ఇంటర్వ్యూ కాల్స్ పంపి, ఉద్యోగాలు చూపించి తన కంటూ చిన్న ఇల్లు, ఫర్నిచరు,బ్యాంకులో బ్యాలన్సు, భార్య-బిడ్డలకు నగా-నట్రా సంపాదించుకున్నాడు. మనిషి మాట్లాడ్డం-నిలబడ్డం-నడవడం అంత రూళ్ళ మీదనే. అందుకే అందరూ అతన్ని రూళ్ళ వేణు అంటారు. "సార్! నా పేరు నమోదు చేయించుకొని ఆరు సంవత్సరాలు అయింది సార్. బి.ఏ. ప్యాసయి రెండేళ్ళు అయింది. ఇంతవరకూ ఒక ఇంటర్వ్యూ కాల్ కూడా రాలేదు. నా కంటే జూనియర్లు మంచి-మంచి ఉద్యోగాలు సంపాదించు కున్నారు. ఫోర్టు ట్రస్టులో ఏవో ఖాళీలు ఉన్నాయట మీరు పేర్ల జాబితా పంపిస్తున్నారని తెల్సింది. దయచేసి నాక్కూడా కాల్ పంపండి. నాకా అవకాశం కల్పించండి" అన్నాడు రమణ తడబాటు పడుతూ, పారం అప్పగించినట్లు.

"ఫోర్టుకా లిస్టు పంపించేశామే!" "మీకు కాల్ రాలేదా? అయితే అందులో మీ పేరు లేదన్నమాట" అన్నాడు వేణు.

"సార్! దయచేసి లిస్టులో నా పేరు చేర్పించండి నా కీ ఉపకారం చేయండి. మీ మేలు మర్చిపోలేను" అని ప్రాధేయపడ్డాడు రమణ.

"లాభం లేదు మిష్టర్! నేనేం చెయ్యలేను. మీరు వెళ్ళొచ్చు" అన్నాడు వేణు చిరాకుగా.

చేసేది ఏమీ లేక, ఏమి చేయాలో తెలియక దిగులుగా బయటకు నడిచాడు రమణ.

"సంగతేమిటి?"అన్నాడు దర్వానుడు.

జరిగిన విషయం చెప్పాడు రమణ.

"మీరుండండి బాబూ! ఆయన మాట నాకు తెలవదా! అనాగే అంటాడు. ఇలా రండి" అతనిని పిల్చి "తమ దగ్గర

ఏమయినా ఉందా! ఉంటే ఇవ్వండి. నిమిషాలమీద పని అయిపోతుంది" అన్నాడు దర్వాను. జేబులోనుండి పది రూపాయల నోటుతీసి కాగితంమీద పేరు, నెంబరు వేసి ఇచ్చాడు. దర్వానుడు లోపలికి వెళ్ళాడు. రెండు నిమిషాల తరువాత దర్వానుడు చిరునవ్వు నవ్వుకుంటూ వచ్చాడు.

"మీ పని నిమిషంలో అయిపోద్దిబాబూ! ఒకక్షణం ఆగారంటే పిల్చి కాగితం చేతి కిస్తారు" అన్నాడు దర్వానుడు.

రమణ బల్లమీద కూర్చున్నాడు. రెండు నిమిషాల తరువాత కాలింగ్ బెల్ మ్రోగింది. దర్వానుడు లోపలికి వెళ్ళాడు.

మరో నిమిషం తరువాత చేతిలో ప్లాస్కుతో బయటకు వచ్చి "అయ్యా తమర్ని వేణుబాబు పిలుస్తున్నారు వెళ్ళండి. తమరి పంట పండినట్లే. ఆనక మమ్మల్ని మరిసిపోకండి" అన్నాడు దర్వానుడు.

రమణ ఆతృతగా లోపలికి వెళ్ళాడు. వేణు సీటు దగ్గరనుండి మంథహాసముతో మీసాలు మెలివేసుకొంటూ కంట్రాక్టరు వీరరాఘవయ్య తనవంక ఓరగా చూస్తూ బయటకు పోయాడు. వీరరాఘవయ్య కొమారుడు మురళి రమణ వయస్సువాడే. ఇంటర్ వరకూ కలిసే చదువుకున్నారు. ఇంటర్ పోవడంతో మురళి వెనకబడ్డాడు. రమణ బి.ఏ. ప్యాసయ్యే నాటికి గాని మురళి ఇంటర్ పూర్తికాలేదు. పనీ పాటా లేకుండా తిరుగుతున్న కొడుకును తన పనిలో పెట్టుకోవాలనుకున్నాడు వీరరాఘవయ్య. కొడుకు అప్రయోజకత్వాన్ని చూసి ఆ ప్రయత్నం మానేశాడు. ఏదైనా గవర్నమెంటు ఉద్యోగంలో వేయిస్తే తప్ప ప్రయోజనం లేదని రెండు నెలల క్రితమే కొడుకు చేత ఎంప్లాయిమెంటు ఎక్స్‌చేంజిలో రిజిష్టరు చేయించాడు. నిన్న మురళి కన్పించినప్పుడు ఈ విషయం చెప్పాడు. "బి. ఏ. ప్యాసయి రెండేళ్ళు దాటిన తనకే కాల్ రాకపోతే వీడికెలా వస్తుం"దనుకున్నాడు రమణ. వీరరాఘవయ్య ముఖాన్ని చూశాక తన ప్రయత్నం కూడా ఫలించినట్లుగానే భావించాడు రమణ. వేణు గేటుదగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. వేణు రమణ రికార్డుకు సంబంధించిన ఫైలు, ఒక కవరు తీసుకొని తనతోపాటు రమణ్ణి ఆఫీసరుగారి దగ్గరకు రమ్మన్నాడు. రమణ, వేణు వెనుకనే ఆఫీసరు గారి గదిలోనికి వెళ్ళాడు.

ఆఫీసరు "ఏమిటి?" అన్నట్లు వేణు వంక చూశాడు. రమణ ఆఫీసరుకు నమస్కారం చేశాడు. ఆఫీసరు తల పంకించాడు. వేణు ఆఫీసరు ముందు ఫైలు పెట్టి చేతికి తెల్లకవరు అందించాడు.

"ఇదేమిటి?" అన్నాడు ఆఫీసరు.

" మీరే చూడండి సార్! " అన్నాడు వేణు. ఆఫీసరు కవరు తెరచి అందులోనుండి 10 రూపాయల కాగితం బయటకు తీసాడు.

" వాటీజ్ దిస్? " అని - గర్జించాడు ఆఫీసరు.

"సార్! ఈయన ఫోర్టు ఇంటర్‌వ్యూ కాల్ లిస్టులో తన పేరు చేర్చమని 10 రూపాయలు పాదితోషకంగా ఇస్తున్నాడు సార్ నాకు" అన్నాడు వేణు వినయంగా.

ఆఫీసరు కళ్ళు అగ్నిగోళాలే అయ్యాయి. "మిష్టర్ రమణా! బి. ఏ. ప్యాసయిన వాడివి, యువకుడివి. నీలాంటివాళ్ళే

ఇలా ప్రవర్తిస్తే చదువు లేనివారి గతి ఏమిటి? నీలో యిప్పటినుండే అవినీతి బీజం నాటుకొని వుంది. నీలాంటి వానికి ప్రభుత్వ యంత్రాంగలో స్థానమిస్తే అది సమూలంగా విషపూరితమై పోతుంది. దేశభవిష్యత్తుకు గొడ్డలిపెట్టు. నీలాంటి అవినీతిపరులకు ప్రభుత్వ కార్యాలయాల్లో స్థానం లేదు. నీ రిజిస్ట్రేషను కాన్సిల్ చేస్తున్నాను. నీ ప్రథమ తప్పిదంగా భావించి ఇదెంతటి నేరమైనా పోలీసులకు అప్పగించకుండా వదిలేస్తున్నాను" అన్నాడు ఆఫీసరు.

"సార్! సార్! దయ చూపండి!" అంటూ ప్రాధేయపడ్డాడు. కాని రమణ మొర ఆఫీసరు విన్పించుకోలేదు.

"వెళ్ళవయ్యా!" అంటూ కసిరాడు వేణు.

ఆఫీసరు వంక - వేణు వంక మార్చి మార్చి చూశాడు రమణ.

విసురుగా ఆఫీసరు గదినుండి బయటకు వెళ్తూ "ఛీ! కుక్క బ్రతుకు!" అన్నాడు రమణ. మనస్సంతా ముక్కలై పోయింది. కోపం లావాలా కుతకుతా ఉడుకుతూంది. శరీరం అంతా ఉద్రేకంతో వణుకుతుంది. ఎంత నిగ్రహించుకున్నా కోపం ఆవిరిలా బయటకు వస్తోంది.

"ఇక జన్మలో ఈ ఆఫీసు గుమ్మం ఎక్కకూడదు. వీళ్ళని ప్రాధేయపడేకంటే కాయకష్టంచేసి బ్రతకడం మేలు" అని అనుకుంటూ ఆఫీసు గేటు విసురుగా తన్నాడు. ఆ విసురుకు చిరకాలంగా కాళ్ళను అంటిపెట్టుకున్న చెప్పులు పుటుక్కున తెగిపోయాయి. ఇక వాటి అవసరం లేదన్నట్లు కాళ్ళతోనే ఆ ప్రక్కనున్న చెత్తకుండీవైపు విసిరి, జ్ఞానోదయం అయిన బుద్ధుడిలా, లోకాన్ని జయించిన వీరుడిలా ధీరత్వంతో జీవన సమరంలోనికి ఉత్సాహంగా అడుగు పెట్టాడు రమణ. *

*(కథానికా పఠనంలో చదివినది. గత సంచికలోని "పలుకే బంగారమాయె" అన్న శ్రీ పి. వి. శ్రీపతిరావు కథ కూడా.)

---

స్త్రీకి కుమార్తెపట్ల వుండే దృక్పథానికి, కోడలి పట్ల వుండే దృక్పథానికీ దురదృష్టవశాత్తు వైరుధ్యం వుంటున్నది—ప్రత్యేకంగా సాంప్రదాయక హిందూ సమాజంలో. ఆనందంగా వుండే అనేక దాంపత్యాలు తల్లికి, భార్యకు మధ్య సర్దుబాటు లేకపోవడం వల్ల నష్టపడుతున్నాయి, ముక్కలవుతున్నాయి కూడా. తన కుమార్తెకు ఆ కుమార్తె అత్తగారు చేసిన దానికి కోపం తెచ్చుకునే ఒకానొక భర్త తల్లి తన కోడలికి అదే పనిని చేస్తుంది చిత్రంగా. దేవతాస్వరూపంగా త్యాగమూర్తిగా, అపార ప్రేమాభిమానాల చిహ్నంగా తన బిడ్డల పట్ల వుండే తల్లి, అత్తగారి పాత్రలో పీడకురా లవగలదు.

(ఢిల్లీ హైకోర్టు యిచ్చిన ఒక తీర్పు నుండి)